సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 29 । మే । 2024



ఆర్టీఏపై ఏసీబీ కొరడా

దళారుల దందాపై ఏసీబీ దండెత్తింది. నగరంలోని పలు ఆర్టీఏ కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టింది. 8లో▸



పట్టు పురుగుల పెంపకం..

పట్టు పురుగుల పెంపకంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని డాక్టర్ మాధురి అన్నారు. 8లో▸



భూ కబ్జాకు యత్నం

కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు అక్రమార్కులు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో బుధవారం నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు మంగళవారం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మినీ స్టేడియంలో షాద్‌నగర్‌లో ఎలెవన్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ టోర్నీ నిర్వహించనున్నట్లు వివరించారు. విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్ జట్టుకు రూ.25వేలతో పాటుగా ట్రోఫీ అందజేస్తామన్నారు. ఉత్తమ బ్యాట్స్‌మెన్, బౌలర్, ఫీల్డర్, కీపర్‌లకు ట్రోఫీలుంటాయని చెప్పారు.

రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ శశాంక



అధికారులతో మాట్లాడుతున్న శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో వేడుకలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సందేశం రూపొందించేందుకు ఆయా శాఖల ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలన్నారు. ఉద్యాన శాఖ అధికారులు వేదికను అందంగా అలంకరించాలన్నారు. విద్యుత్ అంతరాయం ఉండొద్దన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఇప్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ ప్రమీలారాణి, సీపీఓ సౌమ్య, జిల్లా అధికారులు, పోలీసులున్నారు.

మూల్యాంకనంలో తప్పులపై విచారణ చేపట్టండి

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

తుర్కయంజాల్: ఇంటర్ పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో దొర్లిన తప్పులపై విచారణ చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.శివకుమార్ డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇంటర్ మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులు రెండో సంవత్సరంలో వచ్చిన మార్కులకు సంబంధం లేకుండా ఉందన్నారు. దీంతో మెరిట్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే ఇంటర్ బోర్డును ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఫార్మాసిటీలో సాగు

నోరు మెదపని సర్కార్

- వ్యవసాయ పనులు చేపట్టిన రైతులు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్



నక్కర్తమేడిపల్లిలో రైతులు దున్నిన ఫార్మాసిటీ భూమి

యాచారం: ప్రభుత్వం సేకరించిన ఫార్మాసిటీ భూముల్లో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. వారం క్రితం కురిసిన వర్షాలకు కొందరు ట్రాక్టర్లతో దుక్కులు దున్ని సిద్ధం చేసుకోగా.. మరి కొందరు ఇప్పటికే విత్తనాలు వేశారు. ఎన్నికల ముందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ రద్దు చేసి.. సేకరించిన భూములను మళ్లీ రైతులకే తిరిగి ఇస్తామని ఆ పార్టీ నేతలు హామీలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ సారి రద్దు చేస్తామని.. మరో మారు రద్దు లేదని.. ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా సర్కార్ నుంచి నేటికీ స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని సరిహద్దు మండలాలైన యాచారం, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 2017లో ఫార్మాసిటీకి బీజం వేసిన కేసీఆర్ అనంతరం ఆయా గ్రామాల్లో అసైన్డ్ పట్టాదారులకు ఎకరాకు రూ.8 లక్షలు, ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులకు ఎకరాకు రూ.7.70 లక్షలు, పట్టా భూములు ఎకరాకు రూ.12.50లక్షల చొప్పున పరిహారం అందజేశారు.

హైకోర్టుకు రైతులు..
ఆగ్రహం పెంచుకున్న అధికారులు

ఫార్మాసిటీకి నిర్ణయించిన 19,333 ఎకరాల భూముల్లో అప్పటి ప్రభుత్వం అత్యధికంగా యాచారం మండలంలోని గ్రామాల్లోని అసైన్డ్, పట్టా భూములనే తీసుకునేందుకు నిర్ణయించింది. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోనే 9,851 ఎకరాల పట్టా, అసైన్డ్ భూములను సేకరించాలని నిర్ణయించి 7,640 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించి రైతులకు పరిహారాన్ని అందజేసింది. కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లోని పట్టా రైతులు తమ భూములు ఫార్మాకు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. 2,211 ఎకరాల పట్టా భూములకు సంబంధించిన రైతులు అధికారులు బలవంతంగా, భయాందోళనలకు గురిచేసి ఫార్మాకు భూములు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. రైతుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన హైకోర్టు ఆ భూములను రైతుల అంగీకారం లేకుండా ఫార్మాకు సేకరించరాదని అధికారులకు తేల్చిచెప్పింది. కోర్టుకు వెళ్తారా అంటూ రైతులపై ఆగ్రహం పెంచుకున్న అధికారులు 2,211 ఎకరాల్లో 1,966 ఎకరాల పట్టా భూములకు సంబంధించి ఒక్క రాత్రిలోనే ఆర్డర్ పాస్ చేసి రైతుల పరిహారం డబ్బులను అథారిటీలో జమ చేసింది. దీంతో రైతులు ఇక్కడ ఫార్మాసిటీనే వద్దనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. అనంతరం 2023 ఏడాది చివరలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతులు కేసీఆర్ సర్కార్‌కు ఓటేశారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డిలు గెలుపొందగా, మహేశ్వరం నియోజకవర్గంలో అతి కష్టం మీద బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి గెలుపొందారు.

ఫెన్సింగ్ మాయం

ఫార్మాసిటీపై కొత్త ప్రభుత్వం వైఖరి తేల్చకపోవడంతో రైతులు వారి భూములను కబ్జాలోకి తీసుకుంటున్నారు. అసైన్డ్, పట్టా రైతులు తమ భూముల్లో ట్రాక్టర్లతో దున్ని విత్తనాలు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. నక్కర్తమేడిపల్లి, పల్లె చల్కతండా, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో దాదాపు 4వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూముల్లో రైతులు పొలాలను దున్నారు. పరిహారం పొంది ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన సమయాల్లో ఉన్న విద్యుత్ కనెక్షన్లను మళ్లీ పునఃరుద్ధరించుకుని వరి, కూరగాయల సాగుకు సిద్ధమవుతున్నారు. పశుగ్రాసాన్ని పెంచి పాడి, పశువులు, మేకలు, గొర్రెలను పోషించుకుంటున్నారు. కొందరు రైతులు తమ భూముల్లో టీఎస్‌ఐఐసీ అధికారులు పాతిన ఇనుప ఫెన్సింగ్ సైతం తొలగించేశారు. ఇదే అదునుగా దొంగలు ఆయా గ్రామాల్లోని పొలాల చుట్టూ టీఎస్ఐఐసీ అధికారులు పాతిన ఇనుప కంచెను చోరీ చేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ఫార్మాసిటీకి పట్టా భూములు ఇచ్చిన పట్టణ ప్రాంత వ్యాపారులు, ఉన్నతాధికారులు, రాజకీయవేత్తలు తమ భూములను కబ్జాలోకి తీసుకుని ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు కౌలుకిస్తున్నారు. ఫార్మాసిటీ భూములను కబ్జాలోకి రైతులు తీసుకుంటున్నారని తెలిసినా.. రెవెన్యూ అధికారులు గానీ, టీఎస్ఐఐసీ అధికారులు ఆ భూముల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఫార్మాకు పట్టా భూములు ఇవ్వని రైతులు తమ భూ రికార్డులను నిషేధిత జాబితాలోంచి తొలగించి ధరణి పోర్టల్‌లో తమ పేర్లపై నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పరిహారం పొందిన రైతులు మళ్లీ ఫార్మా భూములను కబ్జాలో తీసుకుంటుండగా.. ఫార్మాకు భూములు ఇవ్వని మాకు అధికారులు అన్యాయం చేస్తారా అంటు నిషేధితా జాబితాలో రికార్డులు పెట్టిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులంతా సాగులో..



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని హామీలు ఇచ్చారు. హామీ మేరకు ఫార్మాసిటీని రద్దు చేసి భూములు ఇస్తారని రైతులు మళ్లీ వారి భూముల్లో సాగు పనులు చేసుకుంటున్నారు. నక్కర్తమేడిపల్లి గ్రామంలో వందలాది ఎకరాల్లో దున్నారు. మా ఉమ్మడి కుటుంబానికి చెందిన 50 ఎకరాలకు పైగానే అసైన్డ్ భూమిని ఫార్మాకు ఇచ్చేశాం.

– రమేశ్, రైతు, నక్కర్తమేడిపల్లి

నిషేధిత జాబితాలో భూములు



ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వడం లేదని, అప్పటి అధికారులు కక్షపూరితంగా వందలాది ఎకరాల పట్టా భూముల రికార్డులను నిషేధిత జాబితాలో పెట్టారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. నేటికి నిషేధిత జాబితాల్లోంచి రికార్డులను తొలగించి రైతుల పేర్ల మీద మార్చడం లేదు. మా గ్రామంలో ఫార్మాకు భూములు ఇచ్చిన రైతులు మళ్లీ సాగు చేసుకుంటున్నారు.

– రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కుర్మిద్ద

టీఎస్ఐఐసీదే పర్యవేక్షణ



మేము రైతులను ఒప్పించి అప్పట్లో ఫార్మాసిటీకి భూములు సేకరించాం. దాదాపు 8వేల ఎకరాలకు పైగా పట్టా, అసైన్డ్ భూమిని సేకరించి, ఆ భూములను టీఎస్ఐఐసీకి అప్పగించాం. అధికారులు ఇనుప స్తంభాలు పాతి, ఫెన్సింగ్ వేశారు. ఇన్నాళ్లు వారి పర్యవేక్షణలోనే ఆ భూములున్నాయి. నేడు వారే పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నిర్ణయాలు తీసుకుంటాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

కబ్జాలను సహించం

- జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



వరద కాల్వను పరిశీలిస్తున్న అనితారెడ్డి

మహేశ్వరం: చెరువులు, కుంటలు, వాగుల కాల్వలను కబ్జా చేస్తే సహించేది లేదని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని ఆముదాల చెరువులోకి వెళ్లే వరద నీటి కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ ముసుగులో చెరువులు, కుంటల కాల్వలను ధ్వంసం చేసి కబ్జా చేస్తున్నారన్నారు. దీంతో వరద నీరు వెళ్లే మార్గం లేక ఇళ్లలోకి, పంట పొలాల్లోకి, రోడ్లపై వరద నీరు పారుతోందన్నారు. గొల్లూరు–అమీర్‌పేట్ మార్గంలో ఓ ప్రైవేట్ వెంచర్ యజమానులు వరద కాల్వను కబ్జా చేసి వెడల్పు తగ్గించి చిన్నగా నిర్మిస్తున్నారన్నారు. గ్రామస్తులు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావడంతో వరద కాల్వను పరిశీలించామన్నారు. చెరువులు, కుంటలు, వాగులు, కాల్వలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొలుసు కట్టు చెరువుల కబ్జా విషయం ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని కోరామన్నారు. వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి కాల్వ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేసి కాల్వను విస్తరించాలని సూచించారు. అనంతరం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కబ్జాకు గురవుతున్న చెరువు కాల్వను పరిశీలించి వెంచర్ నిర్వాహకులకు పనులు నిలిపివేయాలని నోటీసులు ఇచ్చారు. ఆమె వెంట ఇరిగేషన్ డీఈ దుద్యా నాయక్, ఏఈ గోవిందు నాయక్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహిపాల్, గొల్లూరు గ్రామస్తులున్నారు.

నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు

ఫేక్ కాల్‌గా నిర్ధారించిన పోలీసులు

నాంపల్లి: క్రిమినల్ కోర్టును బాంబులతో పేలుస్తామంటూ ఫోన్ చేసి బెదిరించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 12.10 గంటలకు డయల్ 100 ఫోన్ చేశాడు. ఫోన్ కాల్‌ను రిసీవ్ చేసుకున్న పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది స్థానిక పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ సిబ్బందిని అప్రమత్తం చేసింది. హుటాహుటిన నాంపల్లి క్రిమినల్ కోర్టుకు చేరుకున్న పోలీసులు జల్లెడ పట్టారు. స్థానిక పోలీసులతో పాటు డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ అణువణువూ తనిఖీ చేశారు. బాంబు పెట్టిన ఆనవాళ్లు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే నాంపల్లి కోర్టు ప్రాంగణంలో ఉన్న కక్షిదారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఈ విషయం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని అగంతకులు బాంబు పెట్టామంటూ ఫేక్ కాల్ చేశారని నాంపల్లి శాంతిభద్రతల పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అభిలాష్ పేర్కొన్నారు. బెదిరింపులకు పాల్పడిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

బిర్యానీ బిల్లు రూ.1,030..
ఆస్పత్రి బిల్లు రూ.1.70 లక్షలు



రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు (ఇన్‌సెట్‌లో) ఫోన్ పే ద్వారా హోటల్‌కు చెల్లించిన బిల్లు

- పెళ్లిరోజున హోటల్లో భోజనం తిని ఎనిమిది మందికి తీవ్ర అస్వస్థత
- సాయిబాబా ఫ్యామిలీ రెస్టారెంట్‌లో తనిఖీలు
- కేసు నమోదు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేందర్

షాద్‌నగర్: రూ.1,030 చెల్లించి బిర్యానీ తిన్నవారు.. ఇప్పటికే ఆస్పత్రిలో రూ.1.70 లక్షల బిల్లు కట్టారు. ఈ మొత్తం రూ.2 లక్షలు దాటవచ్చని బాధితులు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే వార్త చదివేయండి మరి.. పెళ్లి రోజున సరదాగా బయటకు వెళ్లి.. హోటల్‌లో భోజనం చేసిన వారందరూ ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రి పాలయ్యారు. బిర్యానీ తిని ఇంటికి వెళ్లిన తర్వాత వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. షాద్‌నగర్‌లో జరిగిన ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం.. నందిగామ మండలం అప్పారెడ్డిగూడకు చెందిన కావలి నరేందర్, మంగమ్మ దంపతుల పెళ్లి రోజు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 22న సాయంత్రం షాద్‌నగర్‌కు వచ్చారు. రాత్రి వరకు పట్టణంలో సరదాగా గడిపి.. సుమారు రాత్రి 9:30 గంటలకు మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న సాయిబాబా ఫ్యామిలీ రెస్టారెంట్‌లో భోజనం చేశారు. కడుపు నిండా నాన్‌వెజ్ బిర్యానీ తిని ఇంటి బాట పట్టారు. అర్ధరాత్రి తర్వాత నరేందర్, తన భార్య మంగమ్మ, కుటుంబ సభ్యులు దీక్షిత, తన్విక, అనిరుధ్, అభిలాష్, జ్యోత్స్న, సాయి శ్రీకర్ వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. ఎంతకీ తగ్గకపోవడంతో మరుసటి రోజు ఉదయాన్నే శంషాబాద్ ఆస్పత్రికి వెళ్లారు. కలుషితమైన ఆహారం తినడంతో అస్వస్థతకు గురయ్యారని నిర్ధారించిన వైద్యులు అందరినీ ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన నరేందర్ ఐదు రోజుల పాటు ఐసీయూలో చికిత్స పొందారు. పరిస్థితి కొంత మెరుగుపడటంతో మంగళవారం జనరల్ వార్డుకు షిఫ్ట్ చేశారు. మిగిలిన వారు సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అందరికీ కలిపి ఆస్పత్రి బిల్లు ఇప్పటికే రూ.1.70 లక్షలు దాటిందని.. ఈ మొత్తం రూ.2 లక్షలకు చేరవచ్చని నరేందర్‌రెడ్డి సోదరుడు 'సాక్షి'కి తెలిపారు.

'ఫుడ్ సేఫ్టీ' సోదాలు

విషయం వెలుగులోకి రావడం, సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఉదయ్‌కిరణ్ మంగళవారం తన సిబ్బందితో వెళ్లి షాద్‌నగర్‌లోని సాయిబాబా రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. వంట గదిని పరిశీలించి.. బిర్యానీ శాంపిళ్లను సేకరించారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండటంతో కేసు నమోదు చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

- సమస్యలను ఏకరువు పెట్టిన బాధితులు
- ఎస్టీపీ నిర్మాణంపై అధికారులతో చర్చ



పహాడీషరీఫ్: ఉస్మాన్‌నగర్ ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్ శశాంక

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఉస్మాన్ నగర్ బుర్హాన్ ఖాన్ చెరువు ముంపు ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ శశాంక మంగళవారం పరిశీలించారు. 2020లో భారీ వర్షాలు కురిసినప్పటి నుంచి ఎఫ్‌టీఎల్ పరిధిలో వందలాది నిర్మాణాలు నీట మునిగి ఉన్నాయి. ఈ సమస్యపరిష్కారం కోసం గతంలో ఇళ్లకు అడ్డంగా మట్టితో భారీ కట్ట నిర్మించి రెండో తూం నుంచి నీళ్లు బయటికి వెళ్లేలా చేసి దిగువన భారీగా పైప్‌లైన్ వేశారు. అయినప్పటికీ చాలా ఇళ్లు నీట మునిగి ఉన్నాయి. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ నీటి పారుదల, రెవెన్యూ, మున్సిపాలిటీ, విద్యుత్, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఇళ్లు నీట మునగడానికి కారణాలు.. ఇంకా ఎన్ని ఇళ్లు నీటిలో ఉన్నాయి, ఎఫ్‌టీఎల్ పరిధి తదితర అంశాలపై ఆరా తీశారు. ఎగువ బస్తీల నుంచి వస్తున్న డ్రైనేజీ సైతం ఇదే చెరువులోకి వదులుతుండడంతో నీటి మట్టం తగ్గడం లేదని స్థానికులు కలెక్టర్‌కు వివరించారు. తూం వద్ద నీరు వెళ్లేలా చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని, తాము నిత్యం దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిరంగి నాలా మార్గం విషయాన్ని కింది స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి శుద్ధి కోసం సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) ఏర్పాటు విషయమై చర్చించారు. గొలుసు కట్టు చెరువులుగా ఉన్న బురాన్‌ఖాన్ చెరువు, బాలాపూర్ చెరువు, గుర్రం చెరువుల నడుమ కొనసాగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జల్‌పల్లి కమిషనర్ వాణిరెడ్డి, బాలాపూర్ తహసీల్దార్ మాధవిరెడ్డి, మున్సిపల్ మేనేజర్ సుదర్శన్, డీఈ వెంకన్న, నీటి పారుదల శాఖ ఎస్ఈ హైదర్‌ఖాన్, ఈఈ బన్సీలాల్, డీఈ దుదియా నాయక్, ఏఈ గంగరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, విద్యుత్ డీఈ రాజా రాంరెడ్డి, ఏడీఈ కేవీఎస్ రెడ్డి, ఏఈలు సత్యనారాయణ, రాజు, జలమండలి డీజీఎం గోవింద్ గౌడ్, సెక్షన్ మేనేజర్ సాజిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. మండల పరిధిలోని గొల్లపల్లిలో బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపును ప్రక్రియలో భాగంగా సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లకు మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక కౌంటింగ్ నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అధికారులు, సిబ్బంది అనుమానాలను నివృత్తి చేశారు. ఉదయం 6గంటలకు కౌంటింగ్ కేంద్రాలను చేరుకోవాలని సూచించారు. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేర్‌లింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లకు 28 టేబుల్స్, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాలకు 14 చొప్పున టేబుల్స్ ఏర్పాటు చేస్తారని వివరించారు. సెల్‌ఫోన్లు అనుమతించబడవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై అసభ్య ప్రవర్తన

మీర్‌పేట: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. మీర్‌పేట ప్రశాంతి హిల్స్‌లో నివాసముండే కర్ణాటక చించోలి ప్రాంతానికి చెందిన వలికండి నగేష్(30) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. మంగళవారం ఆయన సిర్లాహిల్స్ వాటర్‌ట్యాంక్ వద్ద ఓ మహిళతో అసభ్యకరంగా మాట్లాడాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


మృతురాలు

మీర్‌పేట: చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం.. మీర్‌పేట పెద్ద చెరువులో మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని మహిళ(60) మృతదేహాన్ని గమనించిన మత్స్యకారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు మహిళ మృతదేహాన్ని వెలికితీసి చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి వివరాలు తెలియలేదని, చెరువు ఒడ్డున కళ్లజోడు, నడుము బెల్ట్ వదిలేసి ఆత్మహత్య చేసుకునేందుకే చెరువులోకి దూకినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ రికవరీ


మహేష్‌కు సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్ఐ

తలకొండపల్లి: పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో కనిపెట్టారు. సెల్‌ఫోన్‌ను బాధితుడికి పోలీసులు అందజేశారు. మంగళవారం ఎస్ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దేవుని పడకల్‌కు చెందిన మహేష్ కొన్ని రోజుల కితం తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. తలకొండపల్లి ఎస్ఐ సహకారంతో సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌లు చోరీకి గురైన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు.


మల్బరీ తోటలను పరిశీలిస్తున్న డాక్టర్ మాధురి, ఏడీఏ ముత్యాలు తదితరులు

పట్టు పురుగుల పెంపకంతో లాభాలు

- రైతులకు ప్రత్యేక రాయితీలు
- డాక్టర్ మాధురి
- సద్వినియోగం చేసుకోవాలని సూచన

తలకొండపల్లి: వ్యవసాయానికి అనుబంధంగా పట్టు పురుగుల పెంపకం చేపట్టి అధిక లాభాలు పొందవచ్చని డాక్టర్ మాధురి అన్నారు. తక్కువ పెట్టుబడితో ఏడాది మొత్తం పంట తీసుకోవచ్చన్నారు. మంగళవారం మండల పరిధిలోని బల్సులపల్లి తండాలో పట్టు పురుగుల పెంపకం, మల్బరీ తోటల సాగుపై పట్టు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ మాధురితో పాటు, జిల్లా సహాయ సంచాలకులు ముత్యాలు, షాద్‌నగర్ డివిజన్ హార్టికల్చర్ అధికారిణి ఉషారాణిలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్బరీ తోటల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ మాధురి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పట్టు పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యతిస్తుందన్నారు. రైతులకు రాయితీలు, సబ్సిడీలను అందజేస్తుందన్నారు. పట్టు పురుగులను పెంచేందుకు నిర్మించే షెడ్డుకు, లోపల నిర్మించే సెల్ఫ్‌కు, అదే విధంగా మందులు, పట్టు గుడ్లను రైతులకు సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. పట్టు పురుగులకు నాణ్యమైన మల్బరీ ఆకులను మేత వేస్తే దిగుబడి అధికంగా వస్తుందన్నారు. పట్టు సాగులో రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. అనంతరం పట్టు పురుగుల పెంపకం, మెళకువలు, మల్బరీ తోటల సాగు విధానం, ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు, షెడ్లను శుభ్రపరచుకునే విధానం, తదితర వాటిపై చర్చించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ముత్యాలు, మాజీ సర్పంచ్ దశరథ్ నాయక్, జిల్లా పట్టు పురుగుల రైతు సంక్షేమ సేవా అధ్యక్షుడు శక్రునాయక్, ఉపాధ్యక్షుడు రఫీ, రైతులు మల్లేశ్, దశ్రు, రవీందర్, కాలు తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం

మంచాల: షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధమైన సంఘటన మంచాల మండలంలోని బోడకొండ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రమావత్ బుజ్జి తన పొలంలో వరి పంటను సాగు చేశారు. వరి కోసి గడ్డివాము గత రెండు వారాల క్రితమే వేశారు. విద్యుత్ స్తంభం సమీపంలో ఉండడంతో షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వచ్చాయి. దీంతో గడ్డివాము పూర్తిగా దగ్ధమైపోయింది. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లిందని స్థానిక రైతులు తెలుపుతున్నారు. బాధితురాలిని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.


బోడకొండలో కాలిపోయిన గడ్డివాము

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పహాడీషరీఫ్: ఎదురుగా వస్తున్న యాక్టివాను కారు ఢీ కొట్టగా ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈదిబజార్‌కు చెందిన మహ్మద్ షబ్బీర్(28), చంపాపేట్‌కు చెందిన సయ్యద్ జావెద్(32)లు బాలాపూర్‌లోని తమ స్నేహితుడి ఇంటికి సోమవారం రాత్రి వెళ్లారు. అనంతరం అర్ధ రాత్రి వారు గణేష్ చౌక్ నుంచి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ఐ-20 కారు యాక్టివాను ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఓవైసీ ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ షబ్బీర్ తెల్లవారుజామున మృతి చెందారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఆర్టీఏపై ఏసీబీ కొరడా

- నగరంలో ఏకకాలంలో అధికారుల దాడులు
- ఏజెంట్ల నుంచి నగదు, డాక్యుమెంట్ల స్వాధీనం
- దళారుల కదలికలపై కొన్నాళ్లుగా నిఘా
- ఏసీబీ దాడులతో అంతటా అప్రమత్తం
- పలు కార్యాలయాల్లో నిలిచిపోయిన పౌరసేవలు


మలక్‌పేట ఆర్టీఓ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి,సిటీబ్యూరో/మణికొండ/చాంద్రాయణగుట్ట/మలక్‌పేట: ఆర్టీఏలో దళారుల దందాపై ఏసీబీ దండెత్తింది. మంగళవారం నగరంలోని వివిధ చోట్ల ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ఏకకాలంలో నిర్వహించిన ఏసీబీ సోదాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. మరోవైపు ఏసీబీ దాడుల భయంతో పలు చోట్ల పౌరసేవలను సైతం నిలిపివేశారు. చాలాకాలం పాటు ఎలాంటి తనిఖీలు, సోదాలు లేకుండా నిరాటంకంగా సాగుతున్న దళారుల కార్యకలాపాలకు మంగళవారం నాటి దాడులతో ఒక్కసారిగా బ్రేక్ పడింది.

దళారులదే రాజ్యం..

రవాణాశాఖ అందజేసే డ్రైవింగ్ లైసెన్సులు, లెర్నింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, బదిలీలు తదితర సుమారు 50కి పైగా పౌరసేవలను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తెచ్చినప్పటికీ పలుచోట్ల దళారులే రాజ్యమేలుతున్నారు. మరోవైపు దళారుల ద్వారా వస్తే తప్ప ప్రజలకు పౌరసేవలు లభించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో నగరంలోని డ్రైవింగ్ స్కూళ్లు, ఏజెంట్‌లు, దళారులు ప్రతి పౌరసేవకు ఒక ధర చొప్పున నిర్ణయించి వాహనదారుల నుంచి ఇష్టారాజ్యంగా వసూళ్లకు తెగబడుతున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ ద్వారా పౌరసేవలను అందజేయడం ఒక ప్రహసనంగా మారింది.

ఏకకాలంలో దాడులు..

మంగళవారం మణికొండలోని రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయంతో పాటు బండ్లగూడలోని దక్షిణ మండలం, మలక్‌పేట్‌లోని తూర్పు మండలం కార్యాలయాల్లో టోలిచౌకి కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించడం గమనార్హం. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్ల బృందం బండ్లగూడలోని ప్రాంతీయ రవాణా కార్యాలయంలో దాడులు నిర్వహించింది. ఏజెంట్లతో పాటు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు కానిస్టేబుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఏజెంట్‌ల నుంచి కొన్ని డాక్యుమెంట్‌లను, నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఏజెంట్ల ఫోన్లలో అధికారుల నంబర్లు..

ఏజెంట్ల మొబైల్ ఫోన్లలో కొందరు అధికారుల ఫోన్ నంబర్లు ఉండడంపై పూర్తి స్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఏసీబీ దాడుల నేపథ్యంలో పౌరసేవలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మూసారంబాగ్‌లోని మలక్‌పేట ఈస్ట్‌జోన్ ఆర్టీఓ కార్యాలయంలో ఏసీబీ సిటీ రేంజ్-1, డీఎస్పీ కె.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన దాడుల్లో 15 మంది బయటి వ్యక్తులను గుర్తించారు. బయటి వ్యక్తులకు సంబంధించిన డాక్యుమెంట్‌లను పరిశీలించి పంపించారు. పలువురు దళారులను పట్టుకున్నారు. కార్యాలయంలో సజ్జమీద పడేసి ఉన్న పర్సులో రూ. 22 వేలు లభించినట్లు అధికారులు తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, ఏజెంట్ల పాత్రపై, అవకతవకలపై సమగ్ర నివేదికను తయారు చేసి ఏసీబీ ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

తాళాలు వేసుకుని పరార్..

ఏసీబీ అధికారుల తనిఖీలతో మలక్‌పేట ఆర్టీఓ కార్యాలయ పరిసర ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. ఆఫీసు చుట్టూ ఉన్న ఏజెంట్లు దుకాణాలకు తాళాలు వేసుకున్నారు. పౌరసేవల కోసం వచ్చిన వాహనదారులను పోలీసులు లోనికి అనుమతించక పోవడంతో నిరాశతో వెనుదిరిగారు. మణికొండలోని డీటీసీ కార్యాలయంలో నిర్వహించిన తనిఖీల్లోనూ పలువురు ఏజెంట్‌లను అదుపులోకి తీసుకొని డాక్యుమెంట్‌లను స్వాధీనం చేసుకున్నారు. మణికొండలో రూ.23710, టోలిచౌకిలో రూ.43360, బండ్లగూడలో రూ.48370 నగదును అనధికార వ్యక్తుల నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.


మలక్‌పేట: వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఇదిగో ఏసీబీ.. అదిగో ఏజెంట్...

మరోవైపు ఏసీబీ దాడుల నేపథ్యంలో గ్రేటర్‌లోని అన్ని ఆర్టీఏ కార్యాలయాలు హడలెత్తాయి. అధికారులు, ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు. ఏ క్షణంలోనైనా దాడులు జరగవచ్చనే సమాచారంతో పలు చోట్ల కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సిబ్బందిని అన్ని విధాలుగా అప్రమత్తం చేశారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆర్టీఏ కార్యాలయాలకు ఏజెంట్‌లను రాకుండా అడ్డుకున్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, లెర్నింగ్ లైసెన్సులు తదితర పౌరసేవల కోసం ఏజెంట్‌ల ద్వారా వెళ్లిన వాహనదారులు తమ స్లాట్‌లను రద్దు చేసుకోవాల్సివచ్చింది. ఏజెంట్‌లకు రూ.వేలల్లో చెల్లించి నష్టపోయామని పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం


కూల్చివేసిన ప్రీకాస్ట్ ప్రహరీ

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

హయత్‌నగర్: కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొందరు అక్రమార్కులు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం మునగనూరు గ్రామంలోని సర్వే నెంబర్ 83లోని సుమారు 800 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు అక్రమార్కులు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ప్రీకాస్టింగ్ ప్రహరీ నిర్మించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిచేందుకు యత్నిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరించారు.

ఆయిల్ పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న అధికారులు

తలకొండపల్లి: ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఉద్యాన శాఖ అధికారిణి ఉషారాణి రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు పెంచేందుకు ప్రభుత్వం పెద్ద రాయితీలు ప్రకటిస్తోందన్నారు. మొక్కలకు 90 శాతం, డ్రిప్పుపై 80 నుంచి 100 శాతం సబ్సిడీ అందుతుందని వివరించారు. ప్రతీ ఏడాది ఎకరాకు రూ.4,200 చొప్పున, నాలుగేళ్లపాటు ప్రభుత్వమే మెయింటెన్స్ ఖర్చులు జమ చేస్తుందని చెప్పారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. ఈ పంటలో చీడ పీడల బెడద తక్కువగా ఉంటుందని, ఎకరాకు 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏరియా మేనేజర్ ప్రమోద్, ఫీల్డ్ ఆఫీసర్‌లు శ్రీను, రుక్మిణి, నవీన్, ఏఈఓలు శ్రీనాథ్, అనిత, నిఖిత, రైతులు పాల్గొన్నారు.

గండిపేట చెరువులో మునిగి బాలుడి మృతి

మణికొండ: కుటుంబ సభ్యులతో సరదా గా గడుపుదామని గండిపేట చెరువుకు వచ్చిన ఓ బాలుడు ఈతరాక చెరువులోకి దిగడంతో నీటిలోమునిగి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... లంగర్‌హౌస్‌కు చెందిన సయ్యద్ ముబిన్ (15) సోమవారం మధ్యాహ్నం తన కుటుంబ సభ్యులతో గండిపేట చెరువు చూసేందుకని ఖానాపూర్ వద్దకు వచ్చారు. తోటి పిల్లలతో కలిసి చెరువులో దిగిన ముబిన్‌కు ఈత రాకపోవటంతో నీటిలో మునిగిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం సాయంత్రం ఎంత వెతికినా ఫలితం దక్కలేదు. మంగళవారం గజ ఈతగాళ్లలను రప్పించి ఓ బోటు సహాయంతో వెతికించటంతో సాయంత్రం బాలుడి మృతదేహం లభించింది.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు, పాన్‌షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సుమారు రూ.2లక్షల నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు. గత రెండు రోజులుగా పట్టణంలో వివిధ దుకాణాల్లో దాడులు నిర్వహించి గుట్కాలు, తంబాకు ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కాలు

మరింత 'ఫోర్స్'

- ఓఆర్ఆర్ వరకు డీఆర్ఎఫ్ విస్తరణ
- అదనపు వాహనాలు, సిబ్బందితో బలోపేతం
- సీఎం ఆదేశాల నేపథ్యంలో చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో వర్షాకాల సమస్యలతో పాటు అగ్ని ప్రమాదాలు, భవనాలు కూలిపోయినప్పుడు తక్షణ స్పందన దళాలతో తగిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ ఈవీడీఎం విభాగంలోని డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) మరింత బలోపేతం కానుంది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వరకూ విపత్తు నిర్వహణ పటిష్టంగా ఉండి ఎలాంటి సమస్యలనైనా తక్షణం పరిష్కరించేలా ఉండాలని, అందుకనుగుణంగా తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని ఇటీవల వివిధ విభాగాల ఉన్నతాధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అందుకనుగుణంగా ఈవీడీఎం విభాగం తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. విపత్తు నిర్వహణ పరిధి జీహెచ్ఎంసీ నుంచి ఓఆర్ఆర్ వరకు విస్తరించనున్నందున అందుకనుగుణంగా విపత్తు నిర్వహణకు సిబ్బంది, వాహనాలు అదనంగా అవసరమని ప్రతిపాదనల్లో పేర్కొన్నట్లు సమాచారం.

ఇప్పటికే 30 డీఆర్ఎఫ్ టీంలు

➡ జీహెచ్ఎంసీలో ప్రస్తుతం 30 డీఆర్ఎఫ్ టీమ్స్ పనిచేస్తున్నాయి. ఒక్కో టీమ్‌కు ఒక వాహనంతో పాటు ఐదుగురు సిబ్బంది, ఉపకరణాలు ఉన్నాయి. విపత్తుకు సంబంధించిన ఏ సమాచారం అందినా తక్షణం అక్కడకు చేరుకునేలా ఈ బృందాలు పని చేస్తున్నాయి. వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా చేయడం, కూలిన చెట్లను తొలగించడంతో పాటు అగ్నిప్రమాదాలు, భవనాలు కూలినప్పుడు డీఆర్ఎఫ్ పనితీరు ప్రశంసనీయంగా ఉంటోంది. మూడు షిఫ్టులుగా పని చేస్తున్న ఈ ఫోర్స్ ఎప్పుడు సమాచారమందినా వెంటనే రంగంలోకి దిగుతోంది.

➡ ఓఆర్ఆర్ పరిధి వరకూ ఇదేవిధంగా సేవలు విస్తరించాల్సి ఉన్నందున ఓఆర్ఆర్ పరిధిలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామపంచాయితీలను పరిగణనలోకి తీసుకొని అందుకనుగుణంగా అదనపు వాహనాలు, టీమ్స్ అవసరమని నివేదించినట్లు తెలిసింది. ఇప్పుడున్న 30 టీమ్స్‌కు అదనంగా మరో 30 టీమ్స్‌కు సరిపడా సిబ్బంది, వాహనాలు, ఉపకరణాలు తదితరాలు అవసరమని కోరారు. ఈ ప్రతిపాదనల్ని ప్రభుత్వం ఆమోదించి అవసరమైన నిధులు మంజూరయ్యాక ఉపకరణాలు తదితరమైనవి సమకూర్చుకోనున్నారు. అవసరమైన సిబ్బందిని పెంచుకోనున్నారు. ఎంపిక చేసిన సిబ్బందికి తగిన శిక్షణ ఇస్తారు.

కొత్త ఉపకరణాలు

భవనాలు కూలిపోయినప్పుడు తదితర సందర్భాల్లో వినియోగించేందుకు అవసరమైన ఎయిర్ లిఫ్టింగ్ బ్యాగ్స్, హైడ్రాలిక్ స్ప్రెడర్ కట్టర్‌లను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం తాజాగా సమకూర్చుకుంది. ఇప్పటికే ఉన్న రక్షణ పరికరాలు, ఉపకరణాలకు తోడు వీటిని ఎన్‌డీఆర్ఎఫ్ నుంచి కొనుగోలు చేసినట్లు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. భారీ వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని ముందస్తుగా తెలుసుకొని తగిన చర్యలతో అప్రమత్తమయ్యేందుకు 'ఎర్లీ వార్నింగ్ సిస్టమ్' మొబైల్ కంట్రోల్ రూమ్‌ను కూడా వినియోగించుకుంటామన్నారు. మొబైల్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటుకు సంబంధించి టెండర్లు ఆహ్వానించినా, ఏజెన్సీల నుంచి తగిన స్పందన రాలేదని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిశాక మరోసారి టెండర్లు పిలిచి వాటిని సమకూర్చుకుంటామన్నారు.



చెట్లను తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది (ఫైల్)

డీఆర్ఎఫ్ విధులు

విపత్తులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు ముందస్తుగా తెలియజేయడం తోపాటు విపత్తులు జరిగిన సందర్భాల్లో వెంటనే స్పందించి ఆస్తి, ప్రాణనష్టాలు జరగకుండా డీఆర్ఎఫ్ విభాగం రంగంలోకి దిగుతుంది. భవనాలు కూలిపోవడం, ప్రజలు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోవడం, అగ్నిప్రమాదాలు జరగడం వంటివి చోటుచేసుకున్నప్పుడు సత్వరం ఘటనా ప్రదేశానికి చేరుకునేందుకు వీలుగా జీహెచ్ఎంసీలోని అన్ని జోన్లలో డీఆర్ఎఫ్ బృందాలు వాహనాలతో కీలకమైన ప్రదేశాల్లో ఉంటాయి. రక్షణకు సంబంధించిన ఉపకరణాలతోపాటు అత్యవసరంగా చేరుకునేందుకు తగిన కమ్యూనికేషన్ సిస్టమ్‌తో పనిచేస్తాయి.